www.prajasakti.com

# ప్రజాశక్తి

శనివారం 13 జులై 2024 | 5 | కాకినాడ



## గ్రామాల విలీనంపై నేడు చర్చా గోష్ఠి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

గ్రామాల విలీన సాధనపై చర్చించేందుకు ఇంద్రపాలెం ఎన్‌టిఆర్ పార్కు (గోదావరి కాలవ గట్టు)లో శనివారం సాయంత్రం 5 గంటలకు అఖిలపక్షం సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇంద్రపాలెం ప్రజా సంఘాల కన్వీనర్ సిహెచ్.విజయ్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంద్రపాలెం గ్రామంతో కలిపి 9 గ్రామ పంచాయతీలు గత 13 సంవత్సరాలుగా పంచాయతీ ఎన్నికలు లేకుండా కాకినాడ కార్పొరేషన్‌లో విలీనమూ లేక పౌర సౌకర్యాల వెతలు ఎదుర్కొంటున్నారు. అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. ఈ గ్రామాలు రూ.కోట్లలో నిధులు రాక నష్టపోయాయన్నారు. స్థానిక పౌర పాలన స్థానే మండల అధికారుల ఏలుబడిలో చిక్కుకున్నాయన్నారు. ఇంద్రపాలెంలోనూ ఇదే పరిస్థితులు నెలకొందన్నారు.

# నడి రోడ్డుపై రాక్ కార్మికులు

- 90 రోజులుగా కార్మికుల ఆందోళన
- స్పందన లేని యాజమాన్యం
- అప్పులతో కార్మికుల కుటుంబాలు
- విధుల్లోకి తీసుకోవాలని నిరసనలు

ప్రజాశక్తి-సామర్లకోట

పర్మినెంట్ కార్మికులను తొలగించిన రాక్ సిరామిక్స్ యాజమాన్యం కార్మికుల డిమాండ్లపై స్పందించడం లేదు. పరిశ్రమ ప్రారంభం నుంచి సుమారు 20 ఏళ్ల నుంచి పని చేస్తున్న కార్మికులను సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉండగా 24 మంది పర్మినెంట్ కార్మికులను ఉన్నపళంగా విధుల్లోంచి తొలగించింది. ఏప్రిల్ 15న సామర్లకోట రాక్ సిరామిక్ యాజమాన్యం కార్మికులను తొలగిస్తున్నట్టు ప్రకటించడంతో అప్పటి నుంచి తమను విధుల్లోకి తీసుకోవాలని ఉద్యోగ భద్రత కల్పించాలని కార్మికులు సిఐటియు మద్దతుతో పోరాటాలు సాగిస్తున్నారు. అయినా వీరికి న్యాయం లభించడం లేదు. సామర్లకోట- పెద్దాపురం రోడ్డులో రాక్ సిరామిక్స్ టైల్స్ పరిశ్రమ దుబాయికి చెందిన రస్ ఆల్ ఖైమా (రాక్) సంస్థ టైల్స్ పరిశ్రమను 2006 జూన్‌లో ఏర్పాటు చేసింది. 2007 జూన్‌లో ఉత్పత్తి ప్రారంభించింది. టైల్స్ తయారీ ప్యాకేజింగ్, ఎగుమతి దిగుమతుల విభాగంలో మొదట్లో సుమారు 1600 మందికి పైగా కార్మికులు 12 విభాగాల్లో నాలుగు షిఫ్టుల్లో పని చేసేవారు. అప్పట్లో రెండు ట్రాక్ లైన్స్‌పై టైల్స్ ఉత్పత్తి జరిగేది. ప్రస్తుతం ఒక ట్రాక్ లైన్‌పై ఉత్పత్తి జరుగుతుండడంతో సుమారు 500 నుంచి 600 మంది లోపు కార్మికులు పని చేస్తున్నారు. జరిగిన అన్యాయంపై తొలుత కాకినాడలో డిప్యూటీ లేబర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఏలూరులోని లేబర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. నూతన జిల్లా కలెక్టర్‌కు తమ గోడు వెళ్ళ బుచ్చుకున్నారు. పెద్దాపురం ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుబాష్, ఎంఎల్‌సి ఐవికి వినతులు ఇచ్చారు. ఏలూరు లేబర్ కమీషనర్ కార్యాలయంలో అయిదుసార్లు సమావేశాలు జరిగినా సమస్య పరిష్కారం కాలేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు స్వంత ప్రాంతానికి రాష్ట్రానికి చెందిన కార్మికులను అర్ధాంతరంగా వెళ్ళగొడుతున్న సంస్థ ఇతర రాష్ట్రాలైన ఒడిషా, బీహార్ తదితర రాష్ట్రాలకు చెందిన కార్మికులను కాంట్రాక్టు పద్ధతిపై చేర్చుకుంటూ తమ పొట్ట కొడుతోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్మికులను తొలగించడానికి ముందస్తుగా ఎటువంటి నోటీసు ఇవ్వలేదని, నిర్దాక్షిణ్యంగా, అర్ధాంతరంగా విధుల నుంచి తొలగించి దిక్కునచోట చెప్పుకోండి అనే విధంగా యాజమాన్యం వ్యవహరించింది. జూన్ 10వ తేదీ నుంచి కార్మికులు కంపెనీ గేటు మందు ఆందోళన చేస్తున్నారు.

### ఖాళీ కంచాలతో కార్మికుల నిరసన

సామర్లకోట అక్రమ తొలగింపులకు నిరసనగా రాక్ సిరామిక్స్ గేటు ముందు సిఐటియు ఆధ్వర్యంలో రాక్ సిరామిక్స్ కార్మికులు శుక్రవారం ఖాళీ కంచాలతో నిరసన తెలిపారు. కార్మికుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ గేటు ముందు కార్మికుల పోరాటం 88వ రోజుకు చేరుకుందని అన్నారు. కార్మికులను అక్రమంగా ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా తొలగించిందన్నారు. ఐదుసార్లు జాయింట్ లేబర్ కమిషనర్ వద్ద చర్చలు జరిగినా యాజమాన్యం మొండి పట్టుదలతో వ్యవహరిస్తుందన్నారు. కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతుంటే కార్మిక శాఖ అధికారులు ఎందుకు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ఆదేశించలేదని ప్రశ్నించారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రికి కూడా కంపెనీ యాజమాన్యం అబద్దాలు చెబుతోందని ఎద్దేవా చేశారు. ఈ నిరసనలో సిఐటియు జిల్లా కార్యదర్శి డి.క్రాంతి కుమార్, చంద్రశేఖర్, గంగాధర్, సతీష్, రామకష్ణ, వరప్రసాద్, మల్లికార్జునరావు, గంగాధర్, క్రాంతి, మంగారావు, అర్జున్ రావు, మూర్తి, సత్యనారాయణ, చంద్రన్న, ప్రభుదాస్, రామచంద్రయ్య, రాజబాబు, సతీష్ కుమార్, శివ నారాయణ, సుబ్బారావు పాల్గొన్నారు.



ఖాళీ కంచాలతో ఫ్యాక్టరీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు



### ఇంటి అద్దెలు కూడా కట్టలేకపోతున్నాం

సంస్థ తొలగించడంతో ఇంటి అద్దెలు, ఇతర ఇఎంఐలు కట్టలేకపోతున్నాము. పిల్లల చదువులకు అప్పులు చేసి కుటుంబ పోషణ కొనసాగిస్తున్నాము. దాదాపు కంపెనీ ప్రారంభం నుంచి ఇక్కడే పని చేస్తున్నాము. టైల్స్ తయారీ పరిశ్రమలో పాలిషింగ్ ప్లాంట్‌లో సీనియర్ ట్రాక్‌మాన్‌గా పనిచేస్తున్నాను. నాకు ఈ పని తప్ప వేరే పని రాదు. ఎక్కడికి వెళ్ళినా ఈ వయస్సులో ఉద్యోగం రాదు.

- జి.వెంకట మల్లికార్జున, కార్మికుడు.



### ఆందోళన చేస్తున్నా సెటిల్‌మెంట్

తమను కొనసాగించాలని 90 రోజులుగా ఆందోళనలు చేస్తుంటే పట్టించుకోని యాజమాన్యం పిఎఫ్, ఇఎస్ఐ తదితర అకౌంట్లు సెటిల్ చేస్తూ బ్యాంకు ఖాతాల్లో సొమ్ములు జమ చేయడం దారుణం. అప్పులు తెచ్చుకుని ఇంట్లో గ్రాసం, పిల్లల చదవులు కొనసాగిస్తున్నాము. యాజమాన్యం చర్చల్లో కేవలం ఆరు నెలలు జీతం మాత్రమే ఇస్తామని చెబుతోంది. మిగిలిన సర్వీసును బట్టి కార్మికులకు ఏడాదికి 10 నెలల చొప్పున జీతం బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాము.

-ఎస్.గంగాధర్, కార్మికుడు



### 16 ఏళ్లుగా పరిశ్రమలో పని చేస్తున్నా

నేను 16 ఏళ్ళుగా తొలుత యానాం సిరామిక్స్, అనంతరం సిరామిక్స్‌లో ప్రెస్ డిపార్టుమెంట్‌లో సీనియర్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాను. ఆకస్మాత్తుగా తొలగిస్తే వేరే పరిశ్రమలో వెళ్లి పని చేయడం కష్టతరం. వడ్డీలకు అప్పులు తెచ్చి 90 రోజులుగా జీవనం సాగిస్తున్నాము. ఇల్లు, బైక్ తదితర వాటి ఇఎంఐలు కట్టడం మానేశాము. తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు.

- దొమ్మేటి చంద్రశేఖర్



### అసత్యాలు వల్లె వేస్తున్న యాజమాన్యం

రాక్ యాజమాన్యం అబద్దాలతో కార్మికులకు అన్యాయం చేస్తోంది. వారికి నష్టాలు వస్తున్నాయని, అందుకే కార్మికులను విధుల నుంచి తొలగించామని చెబుతుంది. మరోవైపు షేర్ మార్కెట్ వాటాదారులకు ఇచ్చిన సమాచారంలో, కంపెనీ వెబ్‌సైట్‌లో లాభాల గురించి గొప్పగా చెప్పుకుంటోంది. తొలగించిన 24 మంది అనేకసార్లు బెస్ట్ ఎంప్లాయాస్ అవార్డులు తీసుకున్న వారు 15 మంది ఉన్నారు. కార్మికులను తొలగించలేదు వారే మానేశారంటోంది. తొలగించిన కార్మికులకు న్యాయం జరిగే వరకూ పోరాటాలు కొనసాగిస్తాము.

- డి.క్రాంతి కుమార్, సిఐటియు జిల్లా కార్యదర్శి

## బియ్యం అక్రమ నిల్వలపై కఠిన చర్యలు

ప్రజాశక్తి-కాకినాడ

పేదల ఆహార భద్రతకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేస్తున్న బియ్యం రిసైక్లింగ్ ద్వారా అక్రమ మార్గాలకు తరలిపోకుండా నిరోధించేందుకు పటిష్టమైన నిఘా, తనిఖీలను నిరంతరం కొనసాగిస్తామని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ హాల్లో మీడియా ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పిడిఎస్ బియ్యం రీసైక్లింగ్ గురించి అందిన సమాచారాల ఆధారంగా గడచిన 15 రోజులుగా జిల్లావ్యాప్తంగా 119 రైస్ మిల్లులు, 76 పెద్ద గొడౌన్లను జాయింట్ కలెక్టర్, పౌరసరఫరాల అధికారుల ఆధ్వర్యంలో తనిఖీలు చేశామన్నారు. ప్రతి మిల్లుకు సంబంధించిన బియ్యం నిల్వలు, సిఎంఆర్ డేటాలను తనిఖీ చేసి అనుమానిత అక్రమ నిల్వల సాంపిళ్లను సేకరించి లాబొరేటరీ పరీక్షలకు పంపామని తెలిపారు. మొత్తం రూ.215 కోట్ల విలువైన 51,427 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సీజ్ చేశామని తెలిపారు. ఇందులో 12,184 మెట్రిక్ టన్నుల బియ్యం లాబ్ పరీక్షల్లో రీసైకిల్డ్ బియ్యంగా నిర్ధారణ అయ్యిందని, మరో 11 వేల టన్నుల బియ్యం నిల్వలకు సంబంధించి పరీక్షా నివేదికలు రావలసి ఉందని తెలిపారు. పాలిష్ చేసిన పిడిఎస్ బియ్యం విదేశాలకు యాంకరేజి పోర్టు ద్వారా ఎగుమతి జరుగుతున్నట్టు గుర్తించామన్నారు. ఈ అక్రమ కార్యకలాపాల నిరోధానికి పోర్టు, కస్టమ్స్, పోలీస్, పౌరసరఫరాల తదితర వంటి 8 శాఖల సమన్వయంతో ప్రత్యేక తనిఖీ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నామన్నారు. రేషన్ కార్డుదారులందరూ బియ్యాన్ని తీసుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ రామ్ సుందర్ రెడ్డి, డిఎస్ఒ ఎంవి.ప్రసాద్, సివిల్ సప్లయ్స్ డిఎం ఎం.బాల సరస్వతి, సమాచార శాఖ డిడి డి.నాగార్జున పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

## అందుబాటులో నిత్యావసర సరుకులు

ప్రజాశక్తి-కాకినాడ

భారంగా మారిన నిత్యావసర సరుకుల ధరలను సామాన్య ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని సిటీ ఎంఎల్‌ఎ వనమాడి కొండబాబు పేర్కొన్నారు. పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రైతుబజార్లు, పెద్ద సంస్థాగత, రిటైల్ దుకాణాల వద్ద సరసమైన ధరలకే నాణ్యమైన సరుకులు విక్రయించే కార్యక్రమాన్ని శుక్రవారం గాంధీనగర్ రైతు బజార్‌లో ఎంఎల్‌ఎ కొండబాబు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ నిలబెట్టుకునే క్రమంలో తొలుత పింఛన్ల పెంపు, ఉచిత ఇసుక విధానంతో పాటు నేడు సామాన్య ప్రజలకు భారంగా ఉన్న నిత్యవసర సరుకుల ధరలను అందుబాటులోకి తీసుకు వచ్చినట్టు తెలిపారు. పట్టణాల పరిధిలో పెరిగిన జనాభా కనుగుణంగా రైతు బజార్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. జనాభా ప్రాతిపదికన రైతులతో పాటు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా రైతు బజార్లు ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఈ నిత్యావసర సరుకులు అన్ని రైతు బజార్లలో మాత్రమే కాక పట్టణ ప్రాంతాల్లోని డిమార్ట్, స్పెన్సర్స్, రిలయన్స్, విజేత వంటి ఇతర మార్టుల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఒ ఎంవి.ప్రసాద్, డిడి అమత్, సిహెచ్.ప్రసాదరావు, ఎంహెచ్ఒ డాక్టర్ పృథ్వీచరణ్, గాంధీనగర్ రైతు బజార్ ఎస్టేట్ అధికారి వై.శివ పాల్గొన్నారు.



విక్రయాలను ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ వనమాడి

### 20న జిల్లా పరిషత్ సమావేశం

ప్రజాశక్తి-కాకినాడ

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ స్థాయి సంఘాలు 1 నుండి 7 వరకు సమావేశం ఈ నెల 20వ తేదీన ఉదయం 10.30 గంటల నుండి నిర్వహిస్తామని జెడ్‌పి సిఇఒ ఎ.శ్రీరామ చంద్ర మూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సంబంధిత స్థాయీ సంఘాల సభ్యులు, అధికారులు విధిగా హాజరుకావాలని సిఇఒ ఆ ప్రకటనలో కోరారు.



ఇఒకు విరాళం అందజేస్తున్న దాతలు

### అన్నదాన పథకానికి రూ.3 లక్షల విరాళం

ప్రజాశక్తి-అన్నవరం

అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం విజయనగరం తిరుమల శెట్టి సాయి సరస్వతి దంపతులు రూ.3 లక్షల విరాళం అందించారు. నగదును దేవస్థానం ఇఒ కె.రామచంద్ర మోహన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం వేద పండితులు పిఆర్ఒ కృష్ణారావు పాల్గొన్నారు.

## స్థలాల ఆక్రమణలపై కఠిన చర్యలు

ప్రజాశక్తి-కాకినాడ

కార్పొరేషన్ స్థలాలను ఆక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు హెచ్చరించారు. స్థానిక జయేంద్ర నగర్‌లో కార్పొరేషన్ స్థలాన్ని ఆక్రమించి చేపట్టిన నిర్మాణాన్ని టౌన్ ప్లానింగ్ సిబ్బంది శుక్రవారం తొలగించారు. ఈ కార్యక్రమాన్ని కమిషనర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేయడం నేరమన్నారు. అటువంటి వ్యక్తులు స్వచ్ఛందంగా నిర్మాణాలు తొలగించాలని ఆదేశించారు. లేని పక్షంలో ఎటువంటి నోటీసులు ఇవ్వకుండానే ఆక్రమణలు తొలగించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్పొరేషన్ తరపున ఆక్రమణలను తొలగించే క్రమంలో జరిగే నష్టాలకు యజమానులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. త్వరలోనే మున్సిపల్ స్థలాల్లోని ఆక్రమణలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. కొన్ని ఖాళీ స్థలాల్లో చెత్త, నిలువనీరు, పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగిపోయాయని, వాటిని తక్షణమే తొలగించాల్సిందిగా ఆయా స్థల యజమానులకు నోటీసులు జారీ చేసినట్టు కమిషనర్ తెలిపారు. స్థలాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం వల్ల దోమలు వృద్ధి చెంది ప్రజారోగ్యానికి భంగకరంగా మారి, అనేక సీజనల్ వ్యాధులకు కారణమవుతున్నాయన్నారు. ఈ విషయంలో స్థల యజమానులు స్పందించకపోతే జరిమానాలు విధించడంతోపాటు ఆయ స్థలాల్లోని చెత్తను నగరపాలక సంస్థ తరపున తొలగించి అందుకు అయ్యే ఖర్చును వారి నుంచే వసూలు చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంట ఎంహెచ్ఒ డాక్టర్ పథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లాజర్, ఆయా సచివాలయ కార్యదర్శులు ఉన్నారు.



అధికారులు తొలగించిన ఆక్రమణలు





ఎంపీ హరీష్, ఎంఎల్‌ఎ సుబ్బరాజును సత్కరిస్తున్న నాయకులు

### దళిత గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-తాళ్లరేవు

దళిత గ్రామాల్లో సమస్యలన్నీ పరిష్కరించడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్, ముమ్మిడివరం ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు అన్నారు. స్థానిక అంబేద్కర్ భవనం ఆవరణలో శుక్రవారం టిడిపి మండల ఎస్‌సి విభాగం అధ్యక్షుడు మోర్త భైరవమూర్తి, అధ్యక్షతన ఎంపిపి రాయుడు సునీత గంగాధర్ దంపతులు, పార్టీ నాయకులు ఎంపీ, ఎంఎల్‌ఎలను ఘనంగా సత్కరించారు. అనంతరం ఎంపీ, ఎంఎల్‌ఎలు మాట్లాడారు. దళిత గ్రామాల్లో శ్మశాన వాటికల అభివద్ధికి కృషి చేస్తామని తెలిపారు. మాజీ లోక్ సభ స్పీకర్ జిఎంసి.బాలయోగి నిర్మించిన కమ్యూనిటీ హాళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయని జక్కల ప్రసాద్ బాబు వారి దృష్టికి తీసుకురాగా కమ్యూనిటీ హాళ్ల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తామన్నారు. అంబేద్కర్ భవనాన్ని ఫంక్షన్ హాల్‌గా మార్చేందుకు నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. చమురు సంస్థల ద్వారా ఖర్చు చేసే సిఎస్ఆర్ నిధులు అంబేద్కర్ కోనసీమ జిల్లాకే ముందుగా కేటాయిస్తామని తెలిపారు. ఉద్యోగాల కల్పనలోనూ ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మోర్త భైరవమూర్తి, వెంటపల్లి చంద్రమౌళి, దున్నా సుబ్రహ్మణ్యం, సాధనాల కృష్ణ, వస్కా రెడ్డి, పెయ్యల శ్రీను, బోయిడి వేణుగోపాల్, ఉమామహేశ్వరి, సింహాద్రమ్మ, చెల్లి అశోక్, వివేకానంద, టేకుమూడి లక్ష్మణరావు, కుడిపూడి శివన్నారాయణ, మందాల గంగ సూర్యనారాయణ, నడింపల్లి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## మిడ్డే మీల్స్‌లో నాణ్యత లేకుంటే చర్యలు

ప్రజాశక్తి-కాజులూరు

విద్యార్థులకు అందించే భోజనం నాణ్యత లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని కాకినాడ విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పి.నాగేశ్వరరావు హెచ్చరించారు. మండలంలోని గొల్లపాలెం జిల్లా పరిషత్ పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనాన్ని రుచి చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం పప్పు ఆకుకూర సరిపడినంత లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో 400 మంది విద్యార్థులు చదువుతుంటే కేవలం 190 మంది విద్యార్థులు భోజనం చేస్తుండడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులు పూర్తిస్థాయిలో పాఠశాలలోనే భోజనం చేసేలా ఉపాధ్యాయులు పర్యవేక్షణ చేయాలన్నారు. అనంతరం పిల్లలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. తరగతి గదులను పరిశీలించి ఆర్ఒ ప్లాంట్, న్యూట్రిషన్ గార్డెన్, శానిటేషన్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్‌ఎం సుశీలమణికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు సునీల్ కుమార్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న నాగేశ్వరరావు





విజ్ఞాన యాత్రకు బయల్దేరిన విద్యార్థులు

### విజ్ఞాన యాత్రలతో మానసికోల్లాసం


ప్రజాశక్తి-కాజులూరు

మానసికోల్లసానికి విజ్ఞాన యాత్రలు విద్యార్థులకు ఎంతగానో దోహదం చేస్తాయని కాజులూరు జెడ్‌పి పాఠశాల హెచ్‌ఎం పి.కృష్ణమూర్తి తెలిపారు. శుక్రవారం విద్యార్థుల విజ్ఞాన యాత్రలో భాగంగా మెంటార్ చింతా నారాయణ మూర్తి పర్యవేక్షణలో ఇండస్ట్రియల్ టూర్ కోసం రామచంద్రపురం ఆర్టోస్ పరిశ్రమకు తీసుకువెళ్లారు. ఆర్టోస్ డ్రింక్స్, వాటర్ తయారీ యూనిట్‌లో ప్రతి దశ గురించి కూలంకషంగా తెలుసుకోవడమే కాక ఆర్టోస్ పరిశ్రమ బిఐఎస్ నాణ్యతా ప్రమాణాలు ఏవిధంగా పాటిస్తున్నారో అడిగి తెలుసుకున్నారన్నారు. హెచ్‌ఎం కృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులలో విజ్ఞాన తృష్ణను మేల్కొల్పడానికి ఇటువంటి విజ్ఞాన యాత్రలు ఎంతగానో తోడ్పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో కెవివి సత్యనారాయణ, సుజాత, బాషా, షటిల్ మూర్తి, నాగలక్ష్మి, శుభాలక్ష్మి, జయలక్ష్మి పాల్గొన్నారు.

### ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడిపితే రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చని డిఎస్‌పి లతా కుమారి అన్నారు. శుక్రవారం దివిలిలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్ వినియోగంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ప్రసంగించారు. బైకులపై వెళ్లే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్ ధరించక ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలన్నీ పాటించాలన్నారు. ఈ సదస్సులో సిఐ రవికుమార్, ఎస్ఐ సురేష్, కళాశాల చైర్మన్ బేతినీడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.





ప్రసంగిస్తున్న డిఎస్‌పి లతా కుమారి

### నేడు 'నా డైరీ కనిపించడం లేదు' ఆవిష్కరణ

ప్రజాశక్తి - పెద్దాపురం

సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో సిహెచ్.మంజుల రచించిన 'నా డైరీ కనిపించడం లేదు' కవితా సంపుటి ఆవిష్కరణ ఈనెల 13న నిర్వహిస్తున్నట్టు సాహితీ స్రవంతి కార్యదర్శి కొత్త శివ తెలిపారు. స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో జరిగే పుస్తకావిష్కరణ సభకు సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జోస్యుల కృష్ణబాబు అధ్యక్షత వహిస్తారన్నారు. ఈ సభలో విశ్రాంత ఉపాధ్యాయులు సిహెచ్.సూర్యారావు పుస్తకావిష్కరణ చేస్తారన్నారు. ఈ సభలో ముఖ్యఅతిథిగా సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గనారా పాల్గొంటారన్నారు. ప్రముఖ సాహితీవేత్త అద్దేపల్లి ప్రభు, మిరియాల జయశ్రీ పుస్తక సమీక్ష చేస్తారన్నారు. ఈ సభలో జి.ప్రభాకర్ వర్మ, చల్లా విశ్వనాథం, బి.అనంతరావు, రొంగల వీర్రాజు, వంగలపూడి శివకృష్ణ పాల్గొంటారన్నారు.

### ఆదిత్య ప్రొఫెసర్ వైదేహికి డాక్టరేట్

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్ బిఎన్‌బి.వైదేహి ఆంధ్రా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందినట్టు ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్ రెడ్డి తెలిపారు. డాక్టర్ ఎం.మురళీకృష్ణ కుమార్ నేతృత్వంలో వైదేహి సమర్పించిన థీసిస్‌కు డాక్టరేట్ లభించిందని తెలిపారు. వైదేహి తన జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, డాక్టర్ ఎన్.సతీష్ రెడ్డి, ప్రిన్సిపల్ కె.రవి శంకర్, అధ్యాపకులు, అభినందనలు తెలిపారు.

### విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ప్రజాశక్తి - తాళ్లరేవు, కాజులూరు

చొల్లంగి సబ్ స్టేషన్ పరిధిలో మెయింటనెన్స్ వర్క్ నిమిత్తం శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు ఇఇ జి.ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు కోరంగి, పెద బొడ్డువెంకటాయపాలెం, చినబొడ్డు వెంకటాయపాలెం, చొల్లంగి, చొల్లంగిపేట, జి.వేమవరం, కొత్తూరు, రామన్నపాలెం, పటవల, శాంతమూల గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. కాజులూరు మండలం గొల్లపాలెం సబ్ స్టేషన్ పరిధిలోని గొల్లపాలెం, బందనపూడి, మొగలిపాలెం, సెలపాక, తనుకువాడ, శీల, ఒంటితాడి, మంజేరు, టి.మామిడాడ, గొర్రిపూడి, పెనుమల్ల అంద్రంగి తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని ప్రసాద్ తెలిపారు.

## 'బచ్చు' పాఠశాలలో తనిఖీలు


ప్రజాశక్తి -సామర్లకోట

మండల విద్యాశాఖధికారి-1 వై.శివరామ కృష్ణయ్య శుక్రవారం బచ్చు ఫౌండేషన్ పాఠశాలలో తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'తల్లికి వందనం' పథకం మార్గదర్శకాలను ప్రభుత్వం ఇంకా ఖరారు చేయలేదన్నారు. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు అపోహ పడవద్దని చెప్పారు. ఈ పథకం కింద రూ.15 వేలు రావాలంటే ఇవే మార్గదర్శకాలంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని నమ్మవద్దని తెలిపారు. ఈ పథకం విధివిధానాలు ప్రభుత్వం రూపొందించిన తర్వాత విడుదల చేస్తామని, అప్పటివరకూ ఎలాంటి అవాస్తవాలు నమ్మవద్దని తెలిపారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం నాణ్యతను పరిశీలించారు. మెనూ ప్రకారం రుచిగా తయారు చేసి విద్యార్థులకు వడ్డించాలని ఏజెన్సీని ఆదేశించారు. భోజనం నాణ్యతను ఆయన రుచిచూసి పరిశీలించారు. విద్యార్థులంతా పాఠశాలలోనే భోజనం చేసే విధంగా చూడాలని హెచ్‌ఎం తోటకూర సాయి రామకృష్ణను ఆదేశించారు. కరప చెరువు పాఠశాలను ఎంఇఒ-2 పి.పుల్లయ్య సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలలో మరుగుదొడ్లు, తాగునీరు పరిశీలించి హెచ్‌ఎంలకు పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజన పథకంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ తనిఖీలో పాఠశాలల ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



భోజనం నాణ్యతను పరిశీలిస్తున్న ఎంఇఒ శివరామకృష్ణయ్య

### కార్టూ'నిజం'



## నేరాలు ఘోరాలు

### బాలికను వేధించిన వ్యక్తి అరెస్ట్

**ప్రజాశక్తి-రాజోలు**

బాలికను వేధింపులకు గురి చేసిన పొన్నమండ గ్రామానికి చెందిన యర్రంశెట్టి దుర్గాప్రసాద్ అనే వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసినట్లు రాజోలు ఎస్ఐ జి.పృధ్వి తెలిపారు. ములికిపల్లి గ్రామానికి చెందిన తొమ్మిదవ తరగతి చదువుతున్న బాలికను దుర్గాప్రసాద్ గత మూడు నెలలుగా వెంటపడి వేధిస్తున్నాడని, నన్ను ప్రేమించక పోతే అంతు చూస్తానని బెదిరింపులకు గురి చేసినట్లు బాలిక తల్లిదండ్రులు పోలీసులకు తెలిపారు. గురువారం బాలిక స్కూల్ నుంచి ఇంటికి వచ్చిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో దుర్గా ప్రసాద్ దాడికి పాల్పడ్డాడు. ఆమె కేకలు వేయడంతో బాలిక తల్లి అక్కడకు చేరుకోవడంతో పారిపోయాడు. బాలిక తండ్రి దొమ్మేటి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు దుర్గా ప్రసాద్ పై పోక్సో యాక్టు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు



రెయిలింగ్‌ను ఢీకొన్న కారు

### ఫ్లయ్ ఓవర్‌పై కారు బీభత్సం

**ప్రజాశక్తి-సామర్లకోట**

సామర్లకోట పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి పై శుక్రవారం ఒక కారు బీభత్సం సృష్టించింది. ఈ ప్రమాదంలో ఒక బైకర్‌కు తీవ్ర గాయాలుయ్యాయి. మద్యం మత్తులో కారు వేగంగా నడిపి బైకును కారుతో డ్రైవర్ ఢీ కొట్టాడు. అనంతరం వంతెన రెయిలింగ్‌ను ఢీకొని కారు నిలిచి పోయింది. గాయపడిన నూకరాజును స్థానిక ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కారు డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

### మాజీ మంత్రి పంతంకు ఘన నివాళి

**ప్రజాశక్తి - పెద్దాపురం**

మాజీ మంత్రి పంతం పద్మనాభం 25వ వర్ధంతి సందర్భంగా కాండ్రకోటలోని ఆయన విగ్రహానికి శుక్రవారం పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీలో రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరినా చివరి వరకు పేద ప్రజల అభ్యున్నతి కోసం కషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఊటా నాగబాబు, రెడ్డి బాబులు, గవరసాన సూరిబాబు, ఎలిసెట్టి వెంకటేశ్వర్లు, గంటా రామస్వామి, ఒబిలిశెట్టి నాగభూషణం, చల్లాబత్తుల బాబు, గవరసాన రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఘర్షణ పడుతున్న జనసేనలో రెండు గ్రూపులు

### రాజోలు జనసేనలో గ్రూపుల పోరు

**జాతీయ రహదారిపై కొట్టుకున్న నాయకులు**

**ప్రజాశక్తి-రాజోలు**

రాజోలు జనసేన పార్టీలో రెండు గ్రూపుల మధ్య జరుగుతున్న ఆధిపత్య పోరు కొట్లాటకు దారి తీసింది. సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం జనసేన పార్టీకి చెందిన రాష్ట్ర జాయింట్ సెక్రటరీ దిరిశాల బాలాజీ, జిల్లా ఎన్నికల సమన్వయ కర్త పినిశెట్టి బుజ్జి వర్గానికి, ఎన్నారై యెనుముల వెంకటపతి రాజు గ్రూపునకు మధ్య విభేదాలు తలెత్తాయి. సోషల్ మీడియా వేదికగా ఒకరిని ఒకరు విమర్శించుకుంటూ పోస్టులు పెట్టుకుంటున్నారు. గురువారం వెంకటపతి రాజా దిరిశాల బాలాజీ,పినిశెట్టి బుజ్జి లను హెచ్చరిస్తూ ఫేస్ బుక్ లో ఒక పోస్టు పెట్టారు. శుక్రవారం రాజోలులో ఒక పుట్టినరోజు వేడుకలో రెండు గ్రూపుల వారు హాజరు అయ్యారు. అక్కడ వెంకటపతి రాజా పెట్టిన పోస్టుపై చర్చ జరగడంతో ఇద్దరూ వాగ్వాదానికి దిగారు. ఒకరిపై ఒకరు కేకలు వేసుకుంటూ జాతీయ రహదారిపైకి చేరుకుని పోలీసుల ఎదుటే కొట్టుకున్నారు. ఎస్ఐ పథ్వీ తన సిబ్బందితో రెండు గ్రూపులను అదుపు చేశారు. యెనుముల వెంకటపతి రాజు వర్గీయులు తమ పై దాడి చేసి గాయపరిచారని పినిశెట్టి బుజ్జి వర్గీయులు ఐదుగురు వ్యక్తుల పై పోలీసులకు పిర్యాదు చేశారు.

**మీడియా ప్రతినిధి పై దాడి**

జనసేన పార్టీలో రెండు గ్రూపుల మధ్య కొట్లాట జరుగుతున్న సమయంలో న్యూస్ కవరేజ్ చేస్తున్న సివిఆర్ న్యూస్ ఛానెల్ రిపోర్ట్ గుబ్బల ప్రసాద్ పై జనసేన నాయకుడు పినిశెట్టి వెంకట స్వామి దాడి చేశాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. సివిఆర్ రిపోర్ట్ గుబ్బల ప్రసాద్ పై జరిగిన దాడిని జర్నలిస్ట్ సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఈ సంఘటనపై శనివారం పోలీసు ఉన్నతాధికారులను కలసి వినతిపత్రం ఇవ్వనున్నట్లు జర్నలిస్ట్ సంఘాల నాయకులు తెలిపారు.

### ట్రిపుల్ ఐటికి కె.గంగవరం విద్యార్థిని ఎంపిక

**ప్రజాశక్తి-రామచంద్రపురం**



విద్యార్థిని నాగమణి

కె.గంగవరం జిల్లా పరిషత్ హై స్కూల్ కి చెందిన విద్యార్థిని ఓరుగంటి నాగమణి శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికైందని హై స్కూల్ ఉపాధ్యాయులు శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ట్రిపుల్ ఐటీ కి ఎంపికైన విద్యార్థినికి ఉపాధ్యాయులు తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

### యుడిసి ఉద్యోగులకు బదిలీలు

**ప్రజాశక్తి - యానాం**

పుదుచ్చేరిలోని వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న యానాంకు చెందిన యుడిసిలను బదిలీలు చేస్తూ డిపార్ట్మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్ శాఖ కార్యదర్శి వి.జయశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు. సిహెచ్ కాళీ కృష్ణను యానాం కోఆపరేటివ్ శాఖకు, కరెడ్ల అరుణా దేవిని డిప్యూటీ కలెక్టర్ ఆఫీసు, కడింశెట్టి సుషాంత్ రెడ్డిని యానాం పోలీస్ శాఖకు, ముత్యాల శ్రీరమ్యని ప్రభుత్వ ఆసుపత్రికి, వి.వసంతకుమార్‌ను ఎంజిజి ఆర్ట్స్ కాలేజీ మాహేకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీరిని సంబంధిత అధికారులు 15 రోజుల్లో రిలీవ్ చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.



అవగాహన ర్యాలీలో పాల్గొన్న మహిళలు

### రక్షణ చట్టాలపై అవగాహన అవసరం

**ప్రజాశక్తి-కాజులూరు**

రక్షణ చట్టాలపై మహిళలు, బాలలు అవగాహన కలిగి ఉండాలని దుగ్గుదుర్రు పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సుప్రియ అన్నారు. శుక్రవారం పల్లిపాలెంలో మహిళలకు రక్షణ చట్టాలైన దిశ, గృహహింస, బాల్య వివాహాలు, బాలికలపై లైంగిక వేధింపులు తదితర చట్టాలను వివరిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం డాక్టర్ సుప్రియ స్థానిక అంగన్వాడీ కేంద్రంలో మహిళలతో మాట్లాడారు. మహిళలకు ఉన్న రక్షణ చట్టాలను వినియోగించుకోవాలన్నారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో గ్రామంలో మంచి నీటిని కాచి చల్లార్చిన అనంతరం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కళ్యాణి, సచివాలయ సిబ్బంది రామలక్ష్మి భవాని, దేవి, ఎఎన్ఎం.దుర్గాదేవి, అంగన్‌వాడీ వర్కర్స్ వరలక్ష్మి, సుజాత, చంద్ర కళావతి, లక్ష్మి వర్కర్లు పాల్గొన్నారు.



మరమ్మతులు చేసిన టిడిపి నాయకులు

### అధ్వాన రోడ్డుకు మరమ్మతులు

**ప్రజాశక్తి-గండేపల్లి**

గండేపల్లిలోని సింగరాయపాలెం వెళ్లే రహదారి అధ్వానంగా ఉండటంతో జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ సొంత నిధులతో మరమ్మతులు చేపట్టారు. పార్టీ మండల అధ్యక్షులు పోతుల మోహన్ రావు ఆధ్వర్యాన గోతుల్లో నిండిపోయిన వర్షపు నీటిని తొలగించి షట్రుతో పూడ్చారు. త్వరలోనే పూర్తి స్థాయిలో రోడ్డు నిర్మాణ పనులు చేపడుతామని మోహన్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు యలమాటి కాశీ, వెంపాటి రాజు, రెడ్డి సుబ్బారావు, పైలా వెంకన్న, బొల్లంరెడ్డి రామకష్ణ పాల్గొన్నారు.

### నిబంధనలకు విరుద్ధంగా తరగతుల నిర్వహణ తగదు: ఎస్ఎఫ్ఐ

**ప్రజాశక్తి-అమలాపురం**

అమలాపురం ఆదిత్య డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం క్లాసులు నిర్వహించడంపై ఎస్ఎఫ్ఐ నాయకులు అభ్యంతరం తెలిపారు. భారత విద్యార్థి పెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక అమలాపురంలోని ఆదిత్య డిగ్రి కళాశాల ప్రిన్సిపల్ తో ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ శంకర్ శుక్రవారం మాట్లాడారు. నిబంధనలరే విరుద్ధంగా డిగ్రీ క్లాసులు నిర్వహించడం తగదని తక్షణం క్లాసులు జరపడం ఆపాలని లేనిపక్షంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని ఈ సందర్భంగా తెలియజేశారు. యూనివర్సిటీ నిబంధనలకు విరుద్ధంగా క్లాసులు నిర్వహిస్తున్న తరుణంలో ఆదిత్యా కాలే జీ పై ఉన్నత విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### పిడిఎస్‌యు ఆధ్వర్యంలో పుస్తకాల పంపిణీ

**ప్రజాశక్తి-రామచంద్రపురం**

పిడిఎఫ్ ఆధ్వర్యంలో పట్టణంలోని వైఎస్ఆర్ నగర్ పురపాలక ప్రభుత్వ పాఠశాల్లో 60 మంది విద్యార్థులకు శుక్రవారం పుస్తకాలు పంపిణీ చేశారు. వీటిని ద్రాక్షారామ శంకర్ నారాయణ, బాలాజీ బుక్ షాప్, లావణ్య, సరస్వతి బుక్ షాప్స్, హెల్పింగ్ లిటిల్ స్మైల్ పలివెల వెంకట్ సహకారంతో ఏర్పాటు చేశారు. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, పెన్నులు, అట్టలు, పెన్సిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధు, అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు వెంటపల్లి భీమశంకరం మాట్లాడుతూ అంబేద్కర్ అబ్రహం లింకన్, నెల్సన్ మండేలా స్ఫూర్తితో విద్యార్థులు చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీరాములు, పివైఎల్.అంబటి కృష్ణ, కరిపోతుల నవీన్, చింతా రాజారెడ్డి, ఎస్.దుర్గాప్రసాద్, ఎం.సాయి, ఉపాధ్యాయులు బివి.హనుమాన్, బి.కష్ణ, దేవుల ప్రసన్న తదితరులు పాల్గొన్నారు..

### ధర్మారావు దంపతులకు సత్కారం

**ప్రజాశక్తి-ముమ్మిడివరం**

ప్రముఖ అంబేద్కరీయుడు, బౌద్ధ ఉపాసిక, సుదీర్ఘ కాలం పాటు ఆర్‌టిసి ఉద్యోగిగా పని చేసి ఉద్యోగ విరమణ చేసిన నిమ్మీతి ధర్మారావు దంపతులను మండల బిఎస్ఐ ఘనంగా సత్కరించింది. అయినాపురం నీలంవారిపేటలో శుక్రవారం బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా మండల శాఖ సమావేశం తిరుకోటి సురేష్ కుమార్ అధ్యక్షతన జరిగినది.ఈ సమావేశంలో ఉపాసిక శరత్ మాట్లాడుతూ ఈ నెల 17న అమలాపురం అంబేద్కర్ భవన్‌లో జరిగే ఆర్‌పిఐ మాజీ ఎంఎల్ఎ ఉపాసిక బివి.రమణయ్య 90వ జయంతి ఉత్సవం మరియు బౌద్ధ జీవన పరిచయ సదస్సు కు బౌద్ధులు, అంబేద్కరీయులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆర్‌టిసిలో సుదీర్ఘ కాలం పని చేసి ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన ధర్మారావు దంపతులను బిఎస్ఐ మరియు గ్రామ మహిళలు దుశ్శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ముందు ధర్మారావు దంపతులు రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాసిక కాశి సింహాద్రి వర్య, కాశి మూర్తి, మచ్చా హరికుమార్, చిరంజీవి, గెడ్డం వెంకటేశ్వరరావు, ఎన్.సత్యనారాయణ, డి.దుర్గా ప్రసాద్, వెంకట రమణ, శ్రీహరిలతో పాటు గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.



ధర్మారావు దంపతలను సత్కరించిన బిఎస్ఐ మరియు మహిళలు



సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న కమిషనర్ వెంకటరావు

### సచివాలయాల్లో సేవలను మెరుగుపర్చాలి

**ప్రజాశక్తి-కాకినాడ**

సచివాలయ ఉద్యోగులు మరింత బాధ్యతాయుతంగా పని చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు కోరారు. శుక్రవారం అయన 50 బి సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, రికార్డులను పరిశీలించారు. సచివాలయాల ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను ఆరా తీశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సచివాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని సూచించారు.

### భవిత పాఠశాల పరిశీలన

**ప్రజాశక్తి - పెద్దాపురం**

స్థానిక మహాత్మా గాంధీ మున్సిపల్ పాఠశాల ఆవరణలోని భవిత వికలాంగుల ప్రత్యేక పాఠశాలను శుక్రవారం స్టేట్ ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ కన్సల్టెంట్ డాక్టర్ వై.నరసింహ, జిల్లా సహిత విద్య సమన్వయకర్త చామంతి నాగేశ్వరరావు సందర్శించి పాఠశాల పరిసరాలు, నిర్వహణ తీరుతెన్నులను పరిశీలించారు. అనంతరం వారు భవిత డాక్యుమెంటేషన్, రికార్డులు తనిఖీ చేశారు. సిబ్బందికి లెర్నింగ్ మెటీరియల్‌పై తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖాధికారులు చౌదరి, శర్మ, భవిత సిబ్బంది బి.దుర్గాప్రసాద్ రెడ్డి, బి.ఆనందరావు పాల్గొన్నారు.

### అందరికీ ఉపాధి పనులు కల్పించాలి

**ప్రజాశక్తి-గండేపల్లి**

యర్రంపాలెంలో ఉపాధి హామీ చట్టం మస్తర్లను శుక్రవారం డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి పరిశీలించారు. కూలీలకు వేతనాలు, పనుల కొలతలు గురించి అడిగి తెలుసుకున్నారు. మండల కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలో ఉద్యానవన పంటల పెంపకం, బండ్ ప్లాంటేషన్, ఫారంపాండ్స్, కాటిల్ షెడ్స్, అర్హులైన రైతులందరికీ పనులు ప్రపోజల్స్‌పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ గంగాభవాని, ఇసి రమేష్, టెక్నికల్ అసిస్టెంట్స్, సిబ్బంది పాల్గొన్నారు.

### ర్యాగింగ్‌పై పోలీసుల ప్రత్యేక డ్రైవ్

**ప్రజాశక్తి - సామర్లకోట**

పట్టణంలోని బ్రౌన్‌పేట సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల వద్ద ఆకతాయిల ఈవ్‌టీజింగ్‌పై సిఐ సురేష్, ఎస్ఐలు మూర్తి, మౌనిక, హెచ్‌సి రాజు సిబ్బందితో కలిసి శుక్రవారం సాయంత్రం ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఆడపిల్లల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మైనర్లు వాహనాలు నడపొద్దని హెచ్చరించారు. సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకూ ఈ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.

### సూర్య బలిజ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

**ప్రజాశక్తి-అమలాపురం**

పట్టణంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం లో అమలాపురం సూర్యబలిజ సంఘ సమావేశం గౌరవ అధ్యక్షులు మద్దుల రవినాగేశ్వరావు, గౌరవ సలహాదారుడు ముద్దుల గోపాలకృష్ణ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అమలాపురం సూర్యబలిజ సంఘ అధ్యక్షుడుగా భాస్కర్ల రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా కాళే సురేష్, సెక్రటరీ గా యండమూరి శివకేశవ, జాయింట్ సెక్రటరీగా పందిరి శ్రీనివాస్, ట్రెజరర్‌గా ధరణికొట శ్రీనివాసరావు, అధికార ప్రతినిధి కాళే వెంకటేశ్వరావు, కార్యవర్గ సభ్యులుగా కోటిపల్లి వీరబాబు, గూడూరి సురేష్, సరిదే రమణ, దుగ్గిరాల లక్ష్మీ నరసింహారావు , ఘంటసాల వీర వెంకట సత్యనారాయణ, యండమూరి రాము, వాల్మీకి వీర్రాజు, అన్నాబత్తుల సత్తిబాబు సభ్యులుగా ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తాటిపాక గ్రామ సర్పంచ్ కోటిపల్లి రత్నమల, తాటిపాక గ్రామ సూర్యబలిజ సంఘ మాజీ అధ్యక్షుడు మద్దుల కాసుబాబు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సూర్యబలిజ సంఘం అధికార ప్రతినిధి కాళే వెంకటరత్నం, అంజిబాబు( చెన్నై ) హాజరైనారు. సూర్యబలిజ సంఘం కులస్తులు అన్ని రంగాలలో చైతన్య వంతులుగా ఎదగాలని కోరారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో భాస్కర్రావు, కాళే కనిక లింగేశ్వరరావు, మద్దుల రమేష్ నాయుడు, మద్దుల తేజ, సరిదే రామరాజు, కోటిపల్లి హరీష్, కాలం రమణ, తదితరులు పాల్గొన్నారు.

### ప్రయోగాలు నేర్పించడం స్ఫూర్తిదాయకం

**ప్రజాశక్తి - పెద్దాపురం**

స్థానిక రామారావుపేటలో అల్లం రాజు చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సహకారంతో క్రియా స్వచ్ఛంద సంస్థ అసోసియేషన్‌తో బుద్దా శ్రీనివాస్ గత పది నెలలుగా నిర్వహిస్తున్న యాక్ట్స సైన్స్ సెంటర్ ను శుక్రవారం పలువురు సందర్శించారు. నెదర్లాండ్స్ దేశం ఎంబసీ నుంచి ఎకనామిక్ సెక్షన్ హెడ్ యోస్ట్ గైర్, పాలసీ అడ్వైజర్ ఇమ్మి స్మిత్స్, చీప్ ఆపరేటింగ్ ఆఫీసర్ కిరణ్ మధునాపంతుల ఈ సెంటర్‌ను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ఉచితంగా ప్రయోగాలు నేర్పించడం అనేది స్ఫూర్తిదాయకమన్నారు. సైన్స్ ప్రయోగాలు చిన్ననాటి నుండి విద్యార్థులు స్వయంగా చేయటం వల్ల వారిలో శాస్త్రీయ ఆలోచన విధానం పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా బుద్ధ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ సెంటర్‌ను జిల్లా విద్యాశాఖాధికారి రమేష్, ఉప విద్యాశాఖాధికారి టి.జోసెఫ్ సందర్శించి ఈ సైన్స్ సెంటర్‌ను అన్ని పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారన్నారు. ఈ కార్యక్రమంలో క్రియ కార్యదర్శి జగన్నాథం, చిల్డ్రన్స్ క్లబ్ అధ్యక్షులు కూనిరెడ్డి అరుణ, కార్యదర్శి రొంగల అరుణ్ కుమార్, పూజిత సూర్యశ్రీ, శివ ప్రసాద్ పాల్గొన్నారు.



గుర్రాల రథంపై ఎంపీ హరీష్, ఎమ్మెల్యే దాట్ల

### ఎంపీ హరీష్ మాధుర్, ఎంఎల్ఎ దాట్ల విజయోత్సవ ర్యాలీ

**ప్రజాశక్తి - తాళ్లరేవు**

ఎంపీ గంటి హరీష్ మాధుర్, ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు విజయోత్సవ ర్యాలీ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తూర్పుపేట వై.జంక్షన్ నుంచి కోరంగి పంచాయతీ ప్రతాప్ నగర్, అంబేద్కర్ ఆరామం వరకు ఈ ర్యాలీ సాగింది. ఎంపీ, ఎంఎల్ఎలకు తూర్పు పేట వద్ద ఘనంగా స్వాగతం పలికారు. గుర్రాల రథంపై వారిని ఊరేగించారు. సుంకటరేవు జై భీమ్ పేట, ప్రతాప్ నగర్, అంబేద్కర్ భవన్‌లోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాలకు ఎంపీ హరీష్, ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు.